క్లుప్తంగా

తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



పిల్లలకు సేవలందిస్తున్న ఫిజియోథెరపిస్టు, పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై తల్లిదండ్రులు లేదా సంరక్షకులు శ్రద్ధ వహించాలని ఎంఈఓ -2 కురిటి సోంబాబు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న సేవలు, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు బి. శ్రీకాంత్, ఐఈఆర్టీ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: రెండో విడత దోమల నివారణా మందు స్ప్రేయింగ్ కార్యక్రమం పలు గ్రామాల్లో సోమవారం ప్రారంభమైనట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కోసంగి, వంబరెల్లి, సంకిలిగూడ, బుద్దుడుగూడలలో ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎన్ఎంలు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఆర్ఐ లక్ష్మున్నాయుడు

వీరఘట్టం: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు వినతులు వచ్చినట్లు ఆర్ఐ లక్ష్మున్నాయుడు తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై వినతులు వచ్చాయని, ప్రాధాన్యతాక్రమంలో వీటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు రఘునాయుడు, సురేష్‌కుమార్, నగేష్ పాల్గొన్నారు.

అక్రమాలు రుజువైతే చర్యలు తప్పవు

● డ్వామా పీడీ రామచంద్రరావు



దర్యాప్తు చేపడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు, ఏపీడీ శ్రీహరి

భామిని: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. మండలంలోని లివిరి సచివాలయంలో సోమవారం దర్యాప్తు నిర్వహించారు. లివిరి పంచాయతీలో ఉపాధి మస్తర్లు వేయడం, రానివారి పేర్లతో నిధుల స్వాహాపై గజపతినగరానికి చెందిన ఆరిక శివాజీ చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరి, ఏపీఓ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.

మరిపల్లిలో తాగునీటి ఇబ్బందులు

సాలూరు: మండలంలోని మరిపల్లి గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రక్షితమంచినీటి పథకం మూడురోజుల క్రితం మరమ్మతులకు గురైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో చేతి బోర్లు లేకపోవడంతో తాగునీటికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. దీంతో తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 450 ఇళ్లు, 2 వేల మంది జనాభా ఉన్న గ్రామం కావడంతో తాగునీటి ఎద్దడి అధికమైంది. కొందరి ఇళ్ల వద్ద ఉన్న మోటార్ల వద్దకు వెళ్లి పలువురు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. స్థానిక రామమందిరం వద్ద ఉన్న మోటారు వద్దకు సోమవారం అధిక సంఖ్యలో గ్రామస్తులు బారులు తీరి నీటిని పట్టుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుమలతను వివరణ కోరగా, రక్షిత మంచినీటి పథకం మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే నీటిని అందిస్తామని తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపట్ల పాఠశాల విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది, అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగిపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం, కేజీబీవీ, స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య సిబ్బందితోకలిసి సీజనల్ వ్యాధులు- వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడు..!

● సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
● రోజులు గడుస్తున్నా స్పందించని ప్రభుత్వం



పాలకొండ రూరల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి నాయకులు ఎన్నో హామీలు గుప్పించారు. పాలనా పగ్గాలు చేపట్టి నెల రోజులు పూర్తయిన హామీలను అమలు చేయలేకపోతున్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన నాయకులు వాటి జోలికే వెళ్లడం లేదు. ఇందులో మరీ ముఖ్యమైన హామీ నిరుద్యోగ భృతి. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, అప్పటివరకు నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల చొప్పున భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఈ హామీపై అటు ముఖ్యమంత్రి చంద్రబాబు గాని, ఇటు ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గాని స్పందించకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు చెందిన యువత తల్లిదండ్రుల రెక్కల కష్టంపై ఆధారపడి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి మద్దతుగా నిలిచారు. ఏజెన్సీ కలబోసి ఉన్న నియోజకవర్గంలో పాలకొండ, సీతంపేట, వీరఘట్టం మండలాల్లో ఒక్కో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉండగా మరో ఐదు ప్రైవేటు డిగ్రీ , బీఈడీ, పీజీ కాలేజీలున్నాయి. వీటి నుంచి ఏటా 5 వేల పైచిలుకు విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేస్తున్నారు. మరో 2 వేల మంది ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నట్లు అంచనా. నాలుగు మండలాల పరిధిలో ఉద్యోగ, నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్న వారిలో పురుషులతో సమానంగా మహిళలు ఉండడం విశేషం.

తాజాగా జరిగిన ఎన్నికల సమయంలో కూటమి తరపున బరిలో నిలిచిన జనసేన అభ్యర్థి తరపున ప్రచారానికి వచ్చిన ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నూతనంగా ఓటు హక్కుపొందిన 15 వేల మంది యువత కూటమి అండగా నిలిచారు. ప్రస్తుతం వీరంతా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు.

ఆ ఊసే లేదు..



ఈ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఊసే పట్టడం లేదు. జాబ్ క్యాలెండర్ విధివిధానాలపై ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. వీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 60 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం సగం పోస్టులు కూడా నోటిఫికేషన్‌లో ప్రకటించలేదు. నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు నేటికీ తల్లిదండ్రులపైనే ఆధారపడుతున్నారు. కనీసం భృతి అందిస్తే ఆ సొమ్ముతో ఉద్యోగ అన్వేషణలో పడతారు.
– జి.ప్రవీణ్‌కుమార్, పోస్టు గ్రాడ్యుయేట్, పాలకొండ మండలం

భృతి అందించండి



తల్లిదండ్రుల కష్టంతో డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువతకు ఉపాధి ఎంతో అవసరం. కూటమి అధికారంలోకి వస్తే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. లేకుంటే నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. అధికారంలోకి రోజులు గడుస్తున్నాయి. గతంలోనూ ఇదే తరహాలో నిరుద్యోగ భృతి పేరిట మోసం చేశారు. వాస్తవానికి ప్రతి నిరుద్యోగికి ప్రస్తుత సీఎం చంద్రబాబు గత పాలనలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రూ.60 వేల వరకు బకాయిపడ్డారు. తాజా హామీ అయినా నెరవేర్చండి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యువతకు భరోసా ఇవ్వండి. జాబ్ క్యాలెండర్‌పై వివరణ ఇవ్వాలి. లేకుంటే భృతి అందించాలి. –పి.ఉమామహేశ్వరావు, గ్రాడ్యుయేట్, పాలకొండ మండలం

ఆంక్షలు లేకుండా..



2014 ఎన్నికల సమయంలో టీడీపీ నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేకపోయింది. అప్పట్లో రూ.2 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేకపోయారు. ఇప్పుడు మూడు వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎటువంటి ఆంక్షలు విధించకుండా నిరుద్యోగులందరికీ భృతి అందించాలి. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు ఓట్లేశారు. ఆ హామీలన్నింటినీ అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ముఖ్యంగా నిరుద్యోగులకు భృతి కల్పించాలి.
– విశ్వాసరాయి కళావతి, మాజీ శాసన సభ్యురాలు, పాలకొండ నియోజకవర్గం

ప్రతి పనిలో ప్రజలను భాగస్వామ్యం చేయండి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట: ప్రతి పనిలోనూ ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పబ్లిక్ గ్రీవెన్స్‌లో కమ్యూనిటీ ఆధారిత అవసరాలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయన్నారు. సీసీ రోడ్లు, రక్షణ గోడలు, వైద్యసేవలు, అటవీ భూములకు పట్టాలు, ఎన్ఆర్ఈజీఎస్ పనులపై వస్తున్న వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఆదేశించారు. సీతంపేట, కుశిమి సంతల వద్ద విశ్రాంతి భవనం, విద్యుత్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

టెట్, డీఎస్సీ కోచింగ్ ఇవ్వండి...

అర్హులైన నిరుద్యోగులకు ఐటీడీఏ ద్వారా టెట్, డీఎస్సీ కోచింగ్ ఇప్పించాలని డీఈఓ పగడాలమ్మ, డిప్యూటీ ఈఓ నారాయుడును ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, పాలకొండ ఆర్డీఓ వెంకటరమణ, ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, జిల్లాలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



భద్రగిరి గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్, గరల్స్ జూనియర్ కళాశాలను (పీటీజీ) సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు కె.సురేష్, సత్యవతితో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినిలతో సమావేశమయ్యారు. పాఠశాల, కళాశాలలో అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులంతా చదువులో ఉన్నతంగా రాణించేలా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు వంటి పెట్టాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినిలకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె వెంట టీడీపీ నాయకులు నందివాడ కృష్ణబాబు, డొంకాడ రామకృష్ణ, కడ్రక కళావతి, రొబ్బా లోవరాజు తదితరులున్నారు.

నేటి నుంచి పారిశుధ్య వారోత్సవాలు



పాలకొండ రూరల్: అవగాహనా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

వీరఘట్టం: మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం నుంచి పారిశుధ్య వారోత్సవాలను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య పనులపై ఆగస్టు 2 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని..

పాలకొండ రూరల్: ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, ఆశా, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

ప్రజల భాగస్వామ్యంతో..

గరుగుబిల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుధ్య వారోత్సవాలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. వివిధ శాఖల సిబ్బందితో సోమవారం సమావేశమై పలు సూచనలు చేశారు. నేటి నుంచి ఆగష్టు 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేయాలన్నారు.

ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ఎక్కడైనా డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలినట్లు గుర్తిస్తే వెంటనే ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించాలన్నారు.

మురుగునీరు తొలగించండి

భామిని: మండలంలోని పెద్దదిమిలి దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం చుట్టూ పేరుకుపోయిన మురుగునీటిని తొలగించాలని దళితవాడకు చెందిన పలువురు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ శిరీషను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మురుగునీరు నిల్వ వల్ల అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సమన్వయంతోనే ప్రజా సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి: అధికారులంతా సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విద్యాశాఖ, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధిహామీ, రెవెన్యూ తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు. ఖరీఫ్‌కు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించాలని వ్యవసాయాధికారి విజయభారతికి ఎమ్మెల్యే సూచించారు. శివ్వాం పంచాయతీ సీమలవానివలస, చిలకాం పంచాయతీ దత్తివలస, కారివలస గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల భవనాలు మరమ్మతులకు గురయ్యాయని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో 1బీ, అడంగల్ రావడం లేదని, మ్యూటేషన్ కూడా అవ్వడం లేదని, దీంతో రైతులు రుణాలు పొందేందుకు క్రయవిక్రయాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ కె.జయ ఎమ్మెల్యేకు వివరించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్లోరినేషన్ చేపడుతున్నట్లు గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారులు కేకే వర్మ, సంతోష్‌కుమార్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా చేరవేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, ఎంపీటీసీలు డి.సత్యనారాయణ, కె.భరత్, ఎం.సింహాచలంనాయుడు, సర్పంచ్‌లు అంబటి తవిటినాయుడు, ఆర్.గోవిందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తూ ప్రాణాలొదిలిన అన్నదాత



కృష్ణ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామానికి చెందిన రైతు జక్కు కృష్ణ (65) పొలం పనిచేస్తూ మృతి చెందాడు. తోటి రైతులతో కలసి వేరొకరి పొలంలో పార పని చేసేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. పని చేస్తుండగా ఒక్కసారి గుండెనొప్పి రావడంతో పొలంలోనే కుప్పకూలి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఘనంగా మారు రథయాత్ర

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో మారు రథయాత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జగన్నాథ స్వామి, బలభద్ర, సుభద్ర విగ్రహాలను రథంపై ఊరేగింపుగా గ్రామవీధుల్లో తిప్పుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాలైన గవరమ్మపేట, అల్లువాడ, రామినాయుడువలస, పెదమేరంగి, తుంబలి, రామినాయుడువలస, లింగాలవలస, పిప్పలభద్ర, పరజపాడు, లక్ష్మీపురం గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు.

అభినందనలు



చైత్రికాకృష్ణను అభినందిస్తున్న శాప్, పాఠశాల యాజమాన్యం

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం డీఏవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బొడ్డేపల్లి చైత్రికాకృష్ణ వరుసాగా నాలుగోసారి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించింది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అండర్ - 15 బాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ందని డీఏవీ ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి, కోచ్ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని తల్లిదండ్రులు పూర్ణిమ, శ్రీనివాస్ సమక్షంలో పాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు.

పరామర్శ



జయపాల్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో నవరంగ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కడ్రక జయపాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆయన స్వగ్రామమైన సొలికిరి వెళ్లి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తనపై పోటీచేసిన వ్యక్తిని సైతం పరామర్శించడంతో ఆమె వ్యక్తిత్వాన్ని పలువురు కొనియాడుతున్నారు.

బిల్లబంద ఆక్రమణపై చర్యలు చేపట్టాలి

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బిల్లబంద, గోర్జిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆర్డీఓ కె. హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ అనుమతులు లేకుండా వేసిన అనధికార లే అవుట్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. దీనికి ఆర్డీఓ వెంటనే స్పందించి సంబంధిత డిపార్ట్‌మెంట్ల వారికి ఫోన్ చేసి సమగ్రమైన విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● జిల్లా మలేరియా నియంత్రణ అధికారి జగన్ మోహనరావు



విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుంటున్న డీఎంఓ జగన్ మోహనరావు

పాలకొండ రూరల్: విద్యార్థుల ఆరోగ్య భద్రతపై పాఠశాలలు, వసతిగృహాల అధికారులు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ జగన్ మోహనరావు అన్నారు. సోమవారం పాలకొండ వచ్చిన ఆయన స్థానిక ఇందిరానగర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న వైద్యసేవలు, వసతులపై ఆరా తీశారు. వసతిగృహంలో సిక్ రూమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలంలోని అన్నవరం పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పల్లెల్లో దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి



వీఆర్ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్

గరుగుబిల్లి: అర్హులైన కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించాలని తహసీల్దార్ కె.జయ ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పది రోజుల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన కౌలురైతులను గుర్తించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి మాట్లాడుతూ.. కౌలురైతు గుర్తింపు కార్డులను కలిగి ఉన్న రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలతో పాటు ప్రభుత్వం పథకాలు, రాయితీలు, పంట నష్టపరిహారం వంటివి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డీటీ పీఎస్ లక్ష్మీకుమార్, ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా ఉండాలి

● న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్



రోడ్డు ప్రమాదాల నియంత్రణ, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

పాలకొండ రూరల్: రోడ్లపై వాహనాలు నడిపే వాహన చోదకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఎ. విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలో రహదారి ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన నిబంధనలపై ప్రజలకు అవగాహన సదసస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు అధిగమించవచ్చున్నారు. మితిమీరిన వేగం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారికి కఠినమైన శిక్షలు పడతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విత్తనాలు నాణ్యమైనవే..

● వ్యవసాయశాఖాధికారి సౌజన్య



జనతా రైతుడిపోలో తనిఖీలు చేస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం : మండల కేంద్రంలోని జనతా రైతు డిపోలో విక్రయిస్తున్న విత్తనాలు నాణ్యమైనవని ఏఓ సౌజన్య స్పష్టం చేశారు. డిపో సిబ్బంది తనకు నాసిరకం మొక్కజొన్న విత్తనాలు విక్రయించారని ఆరోపిస్తూ ఓ రైతు డిపో ముందు ఆందోళనకు దిగిన వైనంపై సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందిస్తూ, డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిపో సిబ్బంది 160 కిలోల మొక్కజొన్న విత్తనాలు (164 రకం) తీసుకురాగా.. వీరఘట్టంలోని 20 మంది రైతులకు 150 కిలోలు, పెద్దబుడ్డిడి గ్రామానికి చెందిన రైతులకు ఏడు కిలోలు విక్రయించారని చెప్పారు. వీరఘట్టానికి చెందిన రైతుల పొలాల్లో మొక్కజొన్న మొలకలు రాగా.. పెద్దబుడ్డిడి గ్రామానికి చెందిన రైతు పొలంలో మొలకలు రాలేదన్నారు. వాస్తవానికి విత్తనాలు మంచివేనని.. పెద్దబుడ్డిడి పొలాలు ఇవక కావడంతో మొలకలు రాలేదని తెలిపారు. అయినప్పటికీ ఈ విషయాన్ని విత్తన కంపెనీ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సిరికొండ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న ఏఎంవీఐ, ఆర్టీసీ డీఎం, తదితరులు

పాలకొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమయ్యేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పాలకొండ – సీతంపేట ప్రధాన రహదారిలో సిరికొండ వద్ద ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంటేశ్వర రావుతో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం, అధిక లోడుతో వాహనాలు నడపడం నేరమన్నారు. అనంతరం నిబంధనలు పాటించని పలువురిపై కేసులు నమోదు చేశారు.